# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ సోమవారం 14 ఏప్రిల్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 250





సూర్యుడు ఉదయిస్తున్నంత కాలం మీరు జీవిస్తూనే ఉంటారు..


PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD






## ప్రజల భూములకు.. భూభారతితో భరోసా

గత ప్రభుత్వం మాదిరి హడావిడిగా, తప్పులతో కాకుండా ఎంతో శ్రమించి భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని.. ప్రజల భూములకు భద్రత, భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

- నూతన చట్టానికి నేడు శ్రీకారం
- జూన్ 2 నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదుల స్వీకరణ
- ధరణితో కొల్లగొట్టిన భూములపై ఆడిట్.. త్వరలో వివరాల వెల్లడి
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పోర్టల్‌ను నేడు ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని వెల్లడి

హైదరాబాద్: గత ప్రభుత్వం మాదిరి హడావిడిగా, తప్పులతో కాకుండా ఎంతో శ్రమించి భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని.. ప్రజల భూములకు భద్రత, భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి ఇకపై ఉండదని.. నూతన రెవెన్యూ చట్టం భూభారతి-2025 సోమవారం నుంచి అమలులోకి వస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో మూడు జిల్లాల్లోని మూడు మండలాల్లో పోర్టల్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేసి సమస్యల్ని పరిష్కరిస్తామని.. జూన్ 2వ తేదీ నాటికి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని ఆయన వివరించారు. భూభారతి పోర్టల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభిస్తారని

మిగతా 2లో



యుద్ధం ముగించేందుకు ఓవైపు అమెరికా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న వేళ.. ఉక్రెయిన్‌పై రష్యా భారీస్థాయిలో విరుచుకుపడుతోంది. ఆదివారం సుమీ నగరంపై బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది.

## ఉక్రెయిన్‌పై ఉరిమిన రష్యా

కీవ్:యుద్ధం ముగించేందుకు ఓవైపు అమెరికా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న వేళ.. ఉక్రెయిన్‌పై రష్యా భారీస్థాయిలో విరుచుకుపడుతోంది. ఆదివారం సుమీ నగరంపై బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడిలో 34 మంది మృతి చెందారు. 117 మంది క్షతగాత్రులయ్యారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. స్థానిక కాలమానం ప్రకారం 10.15 గంటలకు రష్యాకు చెందిన రెండు బాలిస్టిక్ క్షిపణులు సుమీ నగరాన్ని తాకాయి. క్రైస్తవులు పర్వదినంగా జరుపుకొనే 'పామ్ సండే' రోజునే ఈ దాడి జరగడం గమనార్హం. ఈ దాడిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్రంగా మండిపడ్డారు. యుద్ధం ముగించాలని రష్యాకు ఏ కోశానా లేదని విమర్శించారు. "చర్చలు ఎన్నడూ రష్యా దాడులను నిరోధించలేదు.

## ఐక్యంగా హక్కులు సాధించుకుందాం



ఖైరతాబాద్ :ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుల గణనలో మున్నూరు కాపుల సంఖ్య తగ్గినట్లు చూపించడం విచారకరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మున్నూరు కాపులంతా ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ మున్నూరుకాపు సంఘం, మున్నూరుకాపు గర్జన కార్యాచరణ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నెక్లెస్ రోడ్డులోని జలవిహార్‌లో 'దశా.. దిశా' ఆత్మీయ సమావేశం జరిగింది. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, డాక్టర్ కె.లక్ష్మణ్ తదితరులు జ్యోతి వెలిగించి సమావేశాన్ని ప్రారంభించారు. కేశవరావు మాట్లాడుతూ ప్రభుత్వం సమగ్ర కులగణన సక్రమంగా చేపట్టినా కొన్ని పొరపాట్లు జరిగాయని, వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఉత్తరాదిలో బీసీలు ఎటు మొగ్గితే ఆ పార్టీనే అధికారంలోకి వస్తోందని డా.లక్ష్మణ్ అన్నారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ బీసీలకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తే కాంగ్రెస్ ఎమ్మెల్సీగా గెలిచిన తీన్మార్ మల్లన్నను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని మండిపడ్డారు. సమగ్ర కులగణనలో రాష్ట్రంలో మొత్తం 3.34 కోట్ల జనాభా ఉన్నారని, అందులో 13 లక్షల మందే మున్నూరు కాపులని పేర్కొన్నారని అది తప్పని అన్నారు. ఈ సమావేశాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వంలోని కొందరు అగ్రవర్ణ పెద్దలు కుట్రలు చేశారని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్న చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి, మంత్రులు నిరాహార దీక్ష చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భారాస నేత పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్, సంఘ అగ్రనేతలు చందు జనార్దన్ పటేల్, మణికొండ వెంకటేశ్వర్‌రావు, మంగళారపు లక్ష్మణ్, కొత్త లక్ష్మణ్ పటేల్, ఆర్వీ మహేందర్‌కుమార్, ఎడ్ల రవిపటేల్, సర్దార్ పుటం పురుషోత్తం పటేల్, బండి పద్మ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## మాట తప్పడమే రేవంత్ బ్రాండ్



గజ్వేల్: యంగ్ ఇండియాపాఠశాలలు తన బ్రాండ్ అని ప్రకటించుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఆ మాట వర్తించదని, మాట తప్పడమే తన బ్రాండ్‌గా ఆయన చెప్పుకోచ్చని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో, బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు.దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన హరీశ్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ ఒక్కో విద్యార్థిపై ఏటా రూ.1.20 లక్షలను ప్రభుత్వం తరఫున ఖర్చు చేసి గురుకుల పాఠశాలలు తీసుకొస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం 'యంగ్ ఇండియా'పేరిట పాఠశాలలు తీసుకొస్తూ, ఏటా రూ.1.50 లక్షల ఫీజు, బస్సు ఫీజు చెల్లించాలని సూచిస్తున్నారని విమర్శించారు. చెట్లు నరికితే సామాన్యులపై వాల్టా చట్టాన్ని ప్రయోగించి శిక్షిస్తున్న అధికారులు.. హెచ్‌సీయూ భూముల్లో చెట్లను నరికేసి, నాలుగు జింకల మరణానికి కారణమైన సీఎం రేవంత్‌రెడ్డిపై ఎన్ని కేసులు పెట్టాలో చెప్పాలన్నారు.400 ఎకరాల భూమిని తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్ల అప్పులు తెచ్చి, బ్రోకర్ ఫీజు కింద రూ.170 కోట్ల లంచం చెల్లించారని ఆరోపించారు.

## కాంగ్రెస్‌కు సోయి లేదు



నల్గొండ: ఎస్ఎల్‌బీసీని శాశ్వతంగా మూసేస్తున్నారని.. సొరంగంలో ఉన్న మృతదేహాలను తీసుకొచ్చే దమ్ము లేదంటూ ప్రభుత్వంపై మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మండిపడ్డారు. ఈ నెల 27న వరంగల్ సభ నేపథ్యంలో నల్లగొండలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృష్ణా నీళ్ల విషయంలో ప్రభుత్వం దద్దమ్మలా మారిందన్నారు. మిర్యాలగూడలో రైతులపై మిల్లర్లు దాడి చేస్తున్నారు. కేసీఆర్ పాలన పోవడంతో నల్లగొండ జిల్లా అనాథలా మారింది. మిల్లర్ల వద్ద కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లంచాలు తీసుకున్నాడు. అందుకే మద్దతు ధర ఇవ్వడం లేదు. కాంగ్రెస్ పార్టీకి కమీషన్లు ఇచ్చే కాంట్రాక్టర్లు, మిల్లర్లే కనిపిస్తున్నారు. చంద్రబాబు నీళ్లు తరలించుకుపోతుంటే కాంగ్రెస్‌కు సోయి లేదు" అంటూ జగదీష్‌రెడ్డి ధ్వజమెత్తారు.

## 'లోన్ తీసుకోవడానికి రూ. 170 కోట్లు కమీషన? ఇచ్చారు'



హైదరాబాద్:హెచ్‌సీయూ భూముల అంశానికి సంబంధించి మంత్రి శ్రీధర్ బాబు పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా శ్రీధర్ బాబు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. హెచ్‌సీయూ భూములపై లోన్ తీసుకరావడానికి 170 కోట్లు కమీషన్ ఇచ్చారు. నిన్న కాక మొన్న కూడా 2వేల బాండ్స్ ద్వారా లోన్స్ తెచ్చారు. మధ్యలో ఓ కంపెనీ వచ్చి వాల్యుయేషన్ ఎకరాకు రూ. 74 కోట్ల నుండి రూ. 53 కోట్లకు తగ్గించారు. ప్రజాధనం 170 కోట్ల కమిషన్ ఎలా ఇచ్చారో మంత్రి శ్రీధర్ బాబు చెప్పాలి. అప్పు తీసుకోలేదని శ్రీధర్ బాబు పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. వెంటనే శ్రీధర్ బాబు క్షమాపణలు చెప్పాలి. మద్రాస్ చీకటి ఒప్పందం లో భాగంగానే కాంగ్రెస్ - బీఆర్ఎస్ కలిసి బీజేపీని బద్నాం చేయాలని చూస్తున్నాయి' అని మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు.

## వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం

మేం అధికారంలోకి వస్తే గంటలో రద్దు యూపీ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్



కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన వక్ఫ్ సవరణల చట్టం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, ఇది 14, 25, 26 ఆర్టికళ్లను పూర్తిగా ఉల్లంఘించడమే అవుతుందని వక్తలన్నారు.

హైదరాబాద్: కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన వక్ఫ్ సవరణల చట్టం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, ఇది 14, 25, 26 ఆర్టికళ్లను పూర్తిగా ఉల్లంఘించడమే అవుతుందని వక్తలన్నారు. వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై అంబేద్కర్ విగ్రహ కూడలిలో ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం భారీ ధర్నా నిర్వహించారు. నగరం నలుమూలల నుంచి ముస్లింలు భారీ ఊరేగింపుతో ట్యాంక్‌బండ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన యూపీ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాట్లాడుతూ.. 'మీరేమీ మహారాజులు కాదు.. ఇష్టారాజ్యంగా దేశాన్ని పాలించడానికి.. రేపు మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గంటలోపు ఆ చట్టాన్ని రద్దు చేస్తాం. భాజపా, ఆ పార్టీ మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో తప్ప.. ఇతర రాష్ట్రాల్లో ఈ వక్ఫ్ చట్టం అమలు కాదు.. కానివ్వబోం.. ఏం చేస్తారో చేసుకోండి. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను కాలరాస్తూ.. రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారు. ప్రతి ముస్లిం పిల్లాడి చేతిలో కంప్యూటర్ చూడాలనుకుంటున్నానని చెప్పిన ప్రధాని మోదీ.. మదర్సాలకు తాళాలు వేస్తున్నారు. యువతరం కళ్లు తెరవాలి. రేపటి మీ భవిష్యత్తును కాపాడుకోవాలి' అని పిలుపునిచ్చారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. మోదీ వక్ఫ్ సవరణ చట్టం కేవలం అదానీ, అంబానీల కోసమే తీసుకొచ్చారని ఆరోపించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వక్ఫ్ సవరణ చట్టాన్ని తొలగించడం ఖాయమన్నారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, తెలంగాణ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్, టెమ్రీస్ వైస్ ఛైర్మన్ ఫహీమ్ ఖురేషీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, హజ్ కమిటీ ఛైర్మన్ సయ్యద్ ఖుస్రోపాషా, ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎంఏ ఫహీమ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భూములకు.. భూభారతితో భరోసా

మంత్రి తెలిపారు. ఆదివారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. “గత భారాస ప్రభుత్వం 2020లో తెచ్చిన ధరణి పోర్టల్ మాదిరిగా ఇది మూడు, నాలుగేళ్లకు పరిమితం కాదు. భవిష్యత్తులో ఏ సీఎం వచ్చినా అమలు చేసేలా పారదర్శకంగా రూపొందించాం. భూభారతిని రెఫరెండంగా తీసుకుని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు వెళ్తాం. గత ప్రభుత్వ హయాంలో ధరణితో కొల్లగొట్టిన భూములపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాం. ఆ వివరాల్ని త్వరలోనే ప్రజలకు వెల్లడిస్తాం. భూభారతిపై ఎవరైనా ఫేక్ ప్రచారం చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. కొందరు కావాలనే ఆటంకాలు కల్పించే ప్రయత్నాలు చేయెుచ్చు. అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఆదేశించారు.



భూముల రక్షణ బాధ్యత ప్రభుత్వానిదే..

రాష్ట్రంలో రైతుల భూముల రక్షణ బాధ్యత ప్రభుత్వానిదే. ఎవరూ ఆందోళన చెందొద్దు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే ధరణిని బంగాళాఖాతంలో వేసి, అందరికీ ఆమోదయోగ్యమైన భూభారతి చట్టాన్ని తీసుకొస్తున్నాం. ఇందులో రెవెన్యూ మంత్రిగా భాగస్వామిని అయినందుకు నా జన్మ ధన్యమైంది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా మూడు మండలాల్లో భూములపై ప్రజల నుంచి మాన్యువల్‌గా ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తాం. జూన్ 2కల్లా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తాం. పైలట్ మండలాలకు నేను వెళ్తా. ఇతర మంత్రులూ పర్యటిస్తారు. నాడు ధరణి వచ్చాక 100 రోజులకుపైగా వెబ్‌సైట్ పనిచేయలేదు. భూభారతి పోర్టల్ ప్రారంభంతో భూముల రిజిస్ట్రేషన్లకు ఎలాంటి ఇబ్బందీ ఉండదు. మంగళవారం నుంచి యథాతథంగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. గత ప్రభుత్వం 2020 చట్టంలో సాదాబైనామా అంశాన్ని చేర్చకపోవడంతో సమస్య వచ్చింది. దాదాపు 6.5 లక్షల సాదాబైనామా దరఖాస్తుల్ని అప్పట్లో తిరస్కరించారు. ఆ తర్వాత వచ్చినవి కలిపి 9.5 లక్షల దరఖాస్తులున్నాయి. వీటిలో అర్హమైనవాటిని భూభారతి చట్టం కింద పరిష్కరిస్తాం.

6 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తాం

భూముల సర్వేకు ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేశాం. ప్రభుత్వ సర్వేయర్ల సంఖ్య ఇక్కడ పరిమితంగా ఉంది. కర్ణాటకలో 17 వేల మంది ప్రైవేటు లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించారు. తెలంగాణలో తొలి దశలో ఐదారు వేల మందిని నియమించుకుంటాం. వారికి 90 రోజులపాటు జిల్లా కేంద్రాల్లో శిక్షణ ఇచ్చి.. లైసెన్సులు ఇస్తాం. వారికి విద్యార్హతగా ఇంటర్ లేదా డిగ్రీని నిర్ణయించే అవకాశం ఉంది. భూభారతి అమల్లోకి వచ్చాక.. తమ భూముల వివరాల కోసం అభద్రతతో ఒకేసారి కోటి మంది లాగిన్ అయితే సాంకేతిక సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. అయినా, ఎవరూ ఆందోళన చెందొద్దు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌ఐసీ ఆధ్వర్యంలో నిర్వహించే పోర్టల్‌కు కొత్త అంశాలను జోడిస్తూ అత్యాధునిక వెర్షన్‌ను ప్రజలకు అందించే ప్రయత్నాలు సాగుతున్నాయి. రిజిస్ట్రేషన్లకు ఆటంకం లేకుండా పోర్టల్ అభివృద్ధి సాగుతుంది.

భూసమస్యల పరిష్కారానికి ట్రైబ్యునళ్లు

గత ప్రభుత్వం వీఆర్‌ఏ, వీఆర్వో వ్యవస్థలను రద్దు చేసినా అవినీతి తగ్గలేదు. వీఆర్వో వ్యవస్థను మళ్లీ తీసుకొచ్చి అవినీతికి ఆస్కారం లేకుండా చూస్తాం. మే నెల మొదటి వారంలో గ్రామ రెవెన్యూ పాలనా అధికారుల వ్యవస్థను అమలులోకి తెస్తాం. ఇప్పటికే ఆ ప్రక్రియ ప్రారంభించాం. భూభారతిలో ఎమ్మార్వో స్థాయి నుంచి సీసీఎల్‌ఏ వరకు సుమారు ఐదు స్థాయుల్లో భూసమస్యల పరిష్కారానికి అధికారాలను వికేంద్రీకరించాం.

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల సంఖ్య ఆధారంగా ట్రైబ్యునళ్లు ఏర్పాటు చేస్తాం. ఉమ్మడి జిల్లాలవారీగా లేదా కొన్ని జిల్లాలు కలిపి ఏర్పాటు కావొచ్చు.

సమస్యలు తగ్గితే ట్రైబ్యునళ్లను కుదిస్తాం. ధరణిలో గతంలో ఉన్న 33 మాడ్యూళ్లను ఆరుకు కుదించాం. దీంతో అందరికీ పోర్టల్ సులభతరంగా ఉంటుంది. పైలట్ మండలాల్లో ప్రతి గ్రామానికి

తహసీల్దార్ వెళ్తారు. ప్రతి మండలానికి అదనపు కలెక్టర్ స్థాయి అధికారి వెళ్తారు. ధరణిలో తప్పుల్ని సవరించగలిగాం కానీ మొత్తం పోర్టల్‌ను తొలగించలేకపోయాం. దానికి అప్‌గ్రేడ్ వెర్షన్‌ని అభివృదిచేస్తున్నాం.

రెండు, మూడు రోజుల్లో టెండర్లు పిలుస్తాం. కొద్ది నెలల్లో తాజా వెర్షన్‌తో మరో సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తాం. అది 50 నుంచి 75 ఏళ్ల వరకు ఉంటుంది’ అని పొంగులేటి పేర్కొన్నారు.

## డిస్క్ బ్రేక్‌తో హీరో స్ప్లెండర్ ప్లస్ 2025

ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ అత్యంత ప్రజాదరణ పొందిన తన స్ప్లెండర్ం 2025 మోడల్‌ను విడుదల చేసింది. డిజైన్ పరంగా పెద్దగా మార్పులు చేయనప్పటికీ.. లుక్ పరంగా చిన్న చిన్న మార్పులు చేసింది. స్ప్లెండర్ం లైనప్‌లో స్ప్లెండర్ ప్లస్, స్ప్లెండర్ం ఎక్స్‌టెక్, స్ప్లెండర్ ప్లస్ ఎక్స్‌టెక్ 2.0 వేరియంట్లను తీసుకొచ్చింది.

పాత మోడళ్లకు ఏ ఇంజిన్ ఇచ్చారో స్ప్లెండర్ం 2025 మోడళ్లలోనూ దాన్నే కొనసాగించారు. ఫేజ్-2 ఓబీడీ-2బి ప్రమాణాలకు అనుగుణంగా ఇంజిన్‌ను తీర్చిదిద్దారు. 2025 ఏప్రిల్ 1 తర్వాత విక్రయించే వాహనాలన్నీ ఈ ప్రమాణాలు పాటించాలని కేంద్రం తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. ఇందులో 4 స్పీడ్ గేర్ బాక్స్ ఉంది. ఇది 7.91 బీహెచ్‌పీ పవర్‌ను, 8.05ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. గ్రాఫిక్స్ పరంగా కొన్ని మార్పులు చేశారు. స్పోర్టీ లుక్‌ను జోడించారు. ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్, ఎల్‌ఈడీ డీఆర్‌ఎల్స్, ఫుల్లీ డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ వంటివి ఉన్నాయి. స్మార్ట్‌ఫోన్‌ను బ్లూటూత్‌తో కనెక్ట్ చేసుకునే సదుపాయం కూడా ఉంది. సీటు, లగేజీ ర్యాక్‌లో మార్పులు చేశారు. అయితే, ఇవి టాప్ ఎండ్ మోడళ్లకే పరిమితం.





## ట్రంప్‌పై ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఆరోపణలు!

భాగస్వామ్య దేశాలపై విధించిన సుంకాలను 90 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ . మొదటినుంచీ వెనక్కి తగ్గేది లేదంటూ ప్రకటనలు చేసిన ఆయన.. ఒక్క చైనా మినహా మిగిలిన దేశాలకు తాత్కాలిక ఊరట కల్పించారు. ఈ నేపథ్యంలో అమెరికా స్టాక్ మార్కెట్లు దూసుకెళ్లాయి. అయితే, సుంకాల మినహాయింపు ప్రకటన కంటే ముందు ట్రంప్ సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టు.. వివాదానికి కారణమైంది. ఆయన ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారంటూ డెమోక్రట్లు ఆరోపిస్తున్నారు.

వివిధ దేశాలపై సుంకాల వాయిదా ప్రకటనకు ముందు ఉదయం డొనాల్డ్ ట్రంప్ ట్రూత్ సోషల్‌లో అధికారిక హ్యాండిల్ నుంచి కొన్ని పోస్టులు పెట్టారు. “బి కూల్: అంతా సక్రమంగా జరుగుతుంది. అమెరికా ఇంతకుముందుతో పోలిస్తే మరింత మెరుగ్గా రాణిస్తుంది” అని తొలుత ఓ పోస్ట్ పెట్టారు. కాసేపటి తర్వాత “కొనుగోలు చేయడానికి ఇదే సరైన సమయం” అంటూ మరో పోస్ట్ పెట్టారు. చివర్లో DJT అని జోడించారు. డొనాల్డ్ ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ కార్పొరేషన్‌ను డీజేటీగా వ్యవహరిస్తారు.

అక్కడికి కొన్ని గంటల తర్వాత సుంకాలపై డొనాల్డ్ ట్రంప్ తన నిర్ణయం వెలువరించారు. ఈనేపథ్యంలో అమెరికా టెక్ సూచీ అయిన నాస్‌డాక్ 12 శాతం మేర రాణించింది. ఎస్‌అండ్‌పీ 500 సూచీ 9.5 శాతం, డోజోన్స్ 8 శాతం మేర లాభపడ్డాయి. డొనాల్డ్ ట్రంప్‌నకు చెందిన మీడియా కంపెనీ షేర్లు భారీగా పెరిగి 22.67 శాతం మేర లాభాల్లో ముగిశాయి. ఈ కంపెనీలో ట్రంప్‌నకు 53 శాతం మేర వాటా ఉంది. దీంతో ఆయన వ్యక్తిగత సంపద 415 మిలియన్ డాలర్ల మేరకు పెరిగింది. ఈ మీడియా సంస్థను ట్రంప్ కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ నిర్వహిస్తున్నారు. ట్రంప్ ఈ పిలుపునివ్వడం.. కొన్ని గంటల తర్వాత టారిఫ్‌లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించడం.. ఆపై అమెరికా స్టాక్ మార్కెట్లు రాణించడం గమనార్హం.

**ఇన్‌సైడర్ ట్రేడింగ్ అంటున్న డెమోక్రట్లు**

ఈ నాటకీయ పరిణామాలపై డెమోక్రట్ సెనేటర్ ఆడమ్ స్కిఫ్ తొలుత దీనిపై గళమెత్తారు. ట్రంప్ ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారని లేదా మార్కెట్ అవతవకలకు పాల్పడ్డారంటూ ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఇదంతా చేస్తున్నారంటూ వర్జీనియాకు చెందిన మరో సెనేటర్ టిమ్ కైన్ ఆరోపించారు. మరికొందరు డెమోక్రట్లు సైతం ఇదేతరహా అభిప్రాయం వ్యక్తంచేశారు. ఈనేపథ్యంలో ట్రంప్ పోస్ట్‌ను కామర్స్ సెక్రటరీ హోవర్డ్ లుట్నిక్ సమర్థించారు. అమెరికా గొప్ప దేశం అని చెప్పడం ఆయన ఉద్దేశమని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడిగా దేశ ఆర్థికవ్యవస్థపై, మార్కెట్లపై నమ్మకాన్ని పాదుకొల్పే బాధ్యత ఆయనపై ఉందంటూ వైట్‌హౌస్ అధికార ప్రతినిధి కుష్ దేశాయ్ కూడా అధ్యక్షుడి చర్యను సమర్థించారు. మొత్తానికి ట్రంప్ పోస్ట్‌తో మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టినవారు మాత్రం భారీగా లాభపడ్డారని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

## టారిఫ్‌ల అంశాన్ని భారత్ జాగ్రత్తగా హ్యాండిల్ చేస్తోంది

పీయూష్ గోయల్



ముంబయి: అమెరికా సుంకాల విషయంలో భారత్ చాలా తెలివిగా వ్యవహరిస్తోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. అమెరికాతో వాణిజ్యాన్ని రెండున్నర రెట్లు పెంచుకోవడంపై తాము దృష్టి సారించామని పేర్కొన్నారు. వివిధ దేశాలపై విధించిన సుంకాలను ట్రంప్ 90 రోజుల పాటు నిలిపివేసిన వేళ ఆయన ముంబయిలో విలేకరులతో మాట్లాడారు.

ఇరు దేశాలపై మధ్య ద్వైపాక్షి సంబంధాలను, సులభతర వాణిజ్యం కోసం ప్రధాని నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమక్షంలో ఇరు దేశాలు ఫిబ్రవరిలోనే ఓ ఒప్పందం చేసుకున్నాయని గోయల్ అన్నారు. దీనివల్ల ఇరు దేశాల వాణిజ్యం 500 బిలియన్ డాలర్లకు చేరుతుందన్నారు. గతంతో పోలిస్తే ఈ మొత్తం రెండున్నర రెట్లు అధికం అన్నారు. దీనివల్ల మరింత మంది ఉద్యోగ అవకాశాలు వస్తాయని, దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పీయూష్ గోయల్ పేర్కొన్నారు.

ప్రస్తుతం ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చల్లో పురోగతి ఉందని, ఇందులో భారత్‌దే పైచేయి అని పీయూష్ గోయల్ పేర్కొన్నారు. అంతకుముందు వాణిజ్య ఒప్పందాలపై పరిశ్రమ వర్గాల ప్రతినిధులతో భేటీ అయిన ఆయన.. వాణిజ్యం గురించి మాట్లాడారు. ప్రభుత్వానికి దేశ ప్రయోజనాలే ముఖ్యమని, వికసిత భారత్ 2047 లక్ష్యాన్ని చేరుకోవడంలో ఈ ద్వైపాక్షిక ఒప్పందం దోహదపడుతుందని పీయూష్ గోయల్ అన్నారు.

## సుంకాలకు ట్రంప్ బ్రేక్.. వాల్‌స్ట్రీట్, ఆసియా మార్కెట్లలో జోష్



ప్రతీకార సుంకాలతో ప్రపంచ దేశాలను గడగడలాడించిన ట్రంప్ ఇప్పుడు కాస్త శాంతించారు. చివరి నిమిషంలో ఈ టారిఫ్ లను 90 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అనూహ్య ప్రకటన చేశారు. ట్రంప్ సుంకాల దెబ్బతో గత కొన్ని రోజులుగా ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రపంచ మార్కెట్లు తాజా నిర్ణయంతో పుంజుకున్నాయి. అమెరికా మార్కెట్లు రికార్డ్ స్థాయిలో లాభాలను ఆర్జించగా.. ఆసియా మార్కెట్లు కూడా గురువారం రాణిస్తున్నాయి. నేటి ట్రేడింగ్‌లో జపాన్ నిక్కీ 8.2శాతం మేర లాభంతో కొనసాగుతోంది. అటు ఆస్ట్రేలియా ఏఎస్‌ఎక్స్ 4.7శాతం, దక్షిణకొరియా కోస్పి 4.9శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ సూచీ 2.8శాతం మేర పెరిగాయి. తైవాన్ సూచీ 9.2శాతం లాభంతో దూసుకెళ్తోంది. షాంఘై సూచీ మాత్రం స్వల్పంగా 0.6శాతం లాభంతో కొనసాగుతోంది. అయితే, మహవీర్ జయంతి సందర్భంగా గురువారం భారత మార్కెట్లు పనిచేయవు.

**24 ఏళ్లలోనే బెస్ట్ డే..**

చైనా మినహా ఇతర దేశాలపై 90 రోజులపాటు 10% సుంకాలనే కొనసాగిస్తున్నామని ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో బుధవారం అమెరికా స్టాక్ మార్కెట్లు భారీగా దూసుకెళ్లాయి. డోజోన్స్ 7.9శాతం, నాస్‌డాక్ ఏకంగా 12.2 శాతం, ఎస్‌అండ్‌పీ 500 సూచీ 9.5శాతం మేర ఎగబాకాయి. నాస్‌డాక్ ఒక రోజులో ఇలా రికార్డ్ స్థాయిలో లాభపడడం 24 ఏళ్లలో ఇదే తొలిసారి కావడం విశేషం. ఇక, ఎస్‌అండ్‌పీ 500 సూచీకి 2008 తర్వాత నుంచి ఇది అతిపెద్ద రోజువారీ లాభం అని విశ్లేషకులు చెబుతున్నారు.

## తగ్గిన టీసీఎస్ లాభం.. ఒక్కో షేరుపై రూ.30 డివిడెండ్




టాటా గ్రూపునకు చెందిన ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. 2024-25 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికి (జనవరి-మార్చి) గానూ కంపెనీ రూ.12,224 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే 2 శాతం తగ్గింది. విశ్లేషకుల అంచనాలను అందుకోవడంలో విఫలమైంది.

ఇక ఆదాయం చూస్తే నాలుగో త్రైమాసికంలో రూ.64,479 కోట్లుగా నమోదైంది. గతేడాది రూ.61,237 కోట్లతో పోలిస్తే ఈ మొత్తం 5.3 శాతం మేర పెరిగింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గానూ టీసీఎస్ రూ.48,553 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అంతకుముందు ఏడాది కాలంతో పోలిస్తే 5.76 శాతం మేర పెరిగింది. ఆదాయం 5.99 శాతం వృద్ధితో రూ.2,55,324 కోట్లకు పెరిగింది.

ఒక రూపాయి ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.30 చొప్పున తుది డివిడెండ్‌ను చెల్లించేందుకు కంపెనీ నిర్ణయిచింది. కంపెనీ వార్షిక సాధారణ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. వరుసగా రెండో త్రైమాసికంలోనూ మెరుగైన ఆర్డర్ బుక్ సాధించామని కంపెనీ సీఈఓ కృతివాసన్ పేర్కొన్నారు. వార్షిక ఆదాయం 30 బిలియన్ డాలర్లను దాటడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు.

చివరి త్రైమాసికంలో కొత్తగా 625 మందిని మాత్రమే చేర్చుకున్నట్లు కంపెనీ చీఫ్ హెచ్‌ఆర్ ఆఫీసర్ మిలింద్ లక్కడ్ పేర్కొన్నారు. పూర్తి సంవత్సరానికి 6433 మందిని చేర్చుకోవడంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 6.07 లక్షలకు చేరిందన్నారు. 2024-25లో తాము 42 వేలమంది ట్రైనీలను ఆన్‌బోర్డ్ చేశామని పేర్కొన్నారు. ఫలితాల నేపథ్యంలో బుధవారం టీసీఎస్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 1.64% తగ్గి రూ.3,239 వద్ద ముగిసింది.

## ఎయిర్‌బస్ హెచ్130 హెలికాప్టర్ల ఫ్యూజ్‌లేజ్ తయారీ

**మహీంద్రా ఏరోస్ట్రక్చర్స్**



దిల్లీ: ఒకే ఇంజిన్ ఉండే ఎయిర్‌బస్ హెచ్130 హెలికాప్టర్ల కోసం ఫ్యూజ్‌లేజ్‌ను మహీంద్రా ఏరోస్ట్రక్చర్స్ మన దేశంలో ఉత్పత్తి చేయనుంది. కర్ణాటకలోని కోలార్‌లో ఉన్న మహీంద్రా ఏరోస్ట్రక్చర్స్ తయారీ కేంద్రంలో ఈ ఫ్యూజ్‌లేజ్‌లను ఉత్పత్తి చేయనున్నారు. ఏటా 60-70 వరకు హెచ్130 ఫ్యూజ్‌లేజ్‌లను ఉత్పత్తి చేయాలని మహీంద్రా భావిస్తోంది. ఒప్పందంలో భాగంగా హెచ్130 హెలికాప్టర్ ప్రధాన ఫ్యూజ్‌లేజ్‌ను ఉత్పత్తి చేసి, ఐరోపాలోని ఎయిర్‌బస్ హెలికాప్టర్ తయారీకేంద్రాలకు ఎగుమతి చేయనుంది. 2027 మార్చిలో మొదటి యూనిట్ డెలివరీ అయ్యే అవకాశం ఉంది. ఈ కాంట్రాక్టుకు సంబంధించి ఆర్థిక వివరాలను కంపెనీ వెల్లడించలేదు. ప్రస్తుతం ప్రపంచంలో ప్రాచుర్యం పొందిన హెలికాప్టర్లలో 8 సీట్లు కలిగిన హెచ్130 ఒకటి. రవాణా, పర్యాటకం, వైద్యం, నిఘా, ప్రైవేట్ విమానయాన కార్యకలాపాలకు ఈ హెలికాప్టర్లను వినియోగిస్తున్నారు.

వేగుచుక్క

# జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులుగా ఈగ సంజీవ్ రెడ్డి.

## - ప్రధాన కార్యదర్శిగా కోర్వ గంగరాజు ఏకగ్రీవంగా ఎన్నిక.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 13:**



జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులుగా ఈగ సంజీవ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కోర్వ గంగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంజీవరెడ్డి నగర్ కాలనీలో జిల్లా అర్చరీ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారి గంట ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఈ ఎన్నికల్లో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని గంట ప్రవీణ్ కుమార్ తెలిపారు. నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ నాలుగు సంవత్సరాలు కొనసాగుతుందని (2025–2029) తెలిపారు. అన్ని పదవులు ఒక్కొక్క నామినేషన్ రావడం వల్ల ఏకగ్రీవంగా ఎన్నుకోబడినట్లు వెల్లడించారు. అర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఈగ సంజీవరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం. వి. సుబ్బారావు, కోశాధికారిగా మంథని బాలగంగాధర్, ప్రధాన కార్యదర్శిగా కే. గంగరాజు, సంయుక్త కార్యదర్శిగా ఈగ పోతన్న, సభ్యుడిగా భదవత్ గణేష్ ఎన్నిక కాగా, వారికి ధృవపత్రాలు అందజేశారు. ఈ ఎన్నికలకు తెలంగాణ రాష్ట్ర అర్చరీ అసోసియేషన్ అబ్జర్వర్ గా పి అరవింద్ కుమార్,
జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అబ్జర్వర్ గా అంద్యాల లింగన్న, డిస్టిక్ స్పోర్ట్స్ అథారిటీ అబ్జర్వర్ గా మీసాల ప్రశాంత్ కుమార్ హాజరయ్యారు.

**జిల్లా అధ్యక్షులు**
**ఈగ సంజీవరెడ్డి మాట్లాడుతూ..**

తనని జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, నూతనంగా ఎన్నుకోబడ్డ జిల్లా కమిటీకి అభినందనలు తెలిపారు. క్రీడలు జిల్లాలో మరింత ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తానని క్రీడాకారులకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అయన అన్నారు. అలాగే నూతనంగా ఎన్నుకోబడ్డ జిల్లా అర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోర్వ గంగరాజు స్వాతాగ అర్చరీ క్రీడాకారుడు, జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులకు శిక్షకుడిగా కూడా వ్యవరించారు. కావున ఆయన ఆధ్వర్యంలో జిల్లాలో జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేస్తామని తెలిపారు. రాష్ట్ర కమిటీ అబ్జర్వర్ గా వచ్చినటువంటి తెలంగాణ అర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. అరవింద్ కుమార్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నుకోబడ్డ జిల్లా కమిటీకి అభినందనలు
తెలుపుతూ ప్రశాంతంగా ఎన్నికలు జరుపుకోవడం సంతోషకరమని, జిల్లాలో క్రీడను మరింత ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కమిటీకి రాష్ట్ర కమిటీ ఎప్పుడు సహాయా సహకారాలు ఉంటాయని అయన అన్నారు. అలాగే జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకోబడ్డ ఈగ సంజీవరెడ్డి అర్చరీ అసోసియేషన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎథిక్స్ మరియు డిసిప్లిన్ కమిటీ చైర్మన్గా వ్యవహరిస్తున్నారని, అర్చరి ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులుగా ఉన్నారు కాబట్టి జిల్లాలో క్రీడను ముందుకు తీసుకెళ్లడానికి సులభంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బోర్గం సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, గాధరి సంజీవరెడ్డి, సయ్యద్ నాభి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్. అంబేద్కర్ మరణానికి కారణం కాంగ్రెస్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 13:**



**ఎంపీ అరవింద్ సంచలన ఆరోపణలు.**
**రాజ్యంగా నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసిన బీజేపీ నేతలు.**

రాజ్యంగ నిర్మాత,భారత రత్న, బీఆర్ అంబేద్కర్ మరణానికి కారణం కాంగ్రెస్ పార్టీ అని నిజామాబాద్ ఎంపీ అరవింద్ సంచలన ఆరోపణలు చేశారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల సూర్యనారాయణ గుప్త, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డిలతో కలిసి ఆదివారం నగరంలోని పులాంగ్ సర్కిల్ లో అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసి, ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఎంపీ అరవింద్ మీడియాతో మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాలను శుద్ధి చేయాలనే నిర్ణయంలో భాగంగా పూలాంగ్ సర్కిల్ లోని అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేశామన్నారు. అంబేద్కర్ పై ఎంతో గౌరవం ఉన్నట్లు నటిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఆనాడు జవహర్ లాల్ నెహ్రూ హయాంలో రాజకీయంగా, మానసికంగా తీవ్రంగా దెబ్బతీసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ రెండు పర్యాయాలు ఎన్నికల్లో అంబేద్కర్ ను కుట్ర పూరితంగా ఓడించిందని, కానీ ఇప్పుడు ఆ పార్టీ నేతలు ఓట్ల కోసం అంబేద్కర్ పేరును జపం చేస్తున్నారని ఆరోపించారు.

**అంబేద్కర్ ను అడుగడుగున అవమానించింది: ఎమ్మెల్యే ధన్ పాల్.**

స్వేచ్ఛ, సమానత్వం కోసం బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం, నిరంతరం ఎన్నో సంఘర్షణాలు ఎదుర్కొంటూ తన జీవితాన్నే పణంగా పెట్టి బలహీన వర్గాల్లో వెలుగులు నింపిన మహనీయులు డా. బి ఆర్ అంబేద్కర్ అని ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగాన్ని రచించి భారత రాజ్యాంగ పితామహుడుగా ప్రపంచం గర్వించదగ్గ నాయకుడిగా ఎదిగిన అంబేద్కర్ ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ పెద్దలు తమకు తాము భారతరత్నాలు ప్రకటిం చుకున్నారు తప్పితే తన జీవితాన్నే ఈ దేశానికి అంకితం చేసిన అంబేద్కర్ కి భారతరత్న ఇవ్వకపోగా అడుగడుగున అవమానించారని మండిపడ్డారు. బిజెపి పార్టీ చొరవతోనే అంబేద్కర్ కి భారతరత్న లభించిందని, అంతే కాకుండా అంబేద్కర్ పుట్టుక నుండి మరణం వరకు వారు జీవించిన ఐదు ప్రదేశాలను పంచ తీర్థాల పేరుతో టూరిజం స్పర్ట్ గా అభివృద్ధి చేస్తున్న ఘనత బిజెపిది అన్నారు.

# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వేసవి శిక్షణ.

**- పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య వెల్లడి.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఏప్రిల్ 13**

జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వేసవి కాలం సందర్భంగా ఉచిత సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి మే 2 వరకు (వారం రోజుల పాటు) నిర్వహించే ఆర్మూర్ రోడ్డులోని ఆర్బీవీఆర్ఆర్ స్కూల్ లో ఈ సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొమ్మిది, పదో తరగతి విద్యార్థినులతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థినులు కూడా క్యాంపులో జాయిన్ కావొచ్చని సీపీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఈ సమ్మర్ కోచింగ్ క్యాంపులో విద్యార్థినులకు ఉచిత బ్రేక్ ఫాస్ట్ ఇస్తారన్నారు.

సమాజంలో ఆడపిల్లల పై అఘాయిత్యాలకు, ఈవ్ టీచింగ్ లు, లైంగిక వేధింపులు ఎక్కువవుతున్న నేపథ్యంలో విద్యార్థినులు తమను తాము రక్షించుకోవడానికి సెల్ఫ్ డిఫెన్స్ (ఆత్మరక్షణ) ఎలా చేసుకోవాలో నేర్పుతారు. ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకునేందుకు అవసరమైన సెల్ఫ్ మోటివేషన్ (ప్రేరణ) క్లాసెస్ కూడా ఉంటాయి. మహిళల పై జరిగే నేరాల పట్ల అవగాహన కల్పించడానికి, నేరాల నుండి



తమను తాము ఎలా ధైర్యంగా కాపాడుకోవాలో, ఆత్మస్థైర్యంతో సమాజంలో ఎలా బతకాలో ఈ శిబిరంలో పోలీస్ తరగతులు నిర్వహిస్తారని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు.

పోలీస్ శాఖ నిర్వహిస్తున్న వారం రోజుల సమ్మర్ క్యాంపులో జాయినవ్వాలనే ఆసక్తి కలిగిన విద్యార్థినులు ఈనెల 13 నుండి 24 వరకు ఫోన్ నెంబర్ 90009 94312 కు కాల్ చేసి పేర్లు నమోదు చేయించుకోవాలి. లేదా.. వెబ్ సైట్ ను సంప్రదించి కూడా ఆసక్తి కలిగిన వారు తమ పేర్లను నమోదు చేయించుకోవచ్చని సీపీ సాయిచైతన్య తెలిపారు.

# కాంగ్రెస్ తీరుమార్చుకోవాలి !

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పయనం అగమ్యగోచరంగా ఉంది. ముఖ్యంగా ఎపిలో కాంగ్రెస్ చుక్కాని లేని నావలా తయారయ్యింది. అక్కడ ఎవరు వచ్చినా ఆ పార్టీ బతికి బట్టకట్టడం కష్టం. గత ఎన్నికలకు ముందు షర్మిల పగ్గాలు చేపట్టినా పెద్దగా లాభం లేకుండా పోయింది. చివరకు ఆమె కూడా గెలవలేదు. వైఎస్ వారసత్వాన్ని అందిపుచ్చుకోవడంలో జగన్ సఫలమైనా..పాలనలో విఫలం అయ్యారు. స్వార్థపూరిత రాజకీయాలు జగన్ పతనాన్ని శాసించాయి. ఇప్పుడు షర్మిల పోరాటం వల్ల జగన్‌కు నష్టం జరగిందే తప్ప కాంగ్రెస్‌కు లబ్ది చేకూరలేదు. తెలంగాణలో బిజెపికి దక్కాల్సిన అధికారం అనూహ్యంగా కాంగ్రెస్‌కు దక్కింది. రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక చేస్తున్న కార్యక్రమాలు కొంతమేరే ఫలితం ఇచ్చినా, సమర్థ నేతగా రుజువు చేసుకోలేక పోతున్నారు. బహునాయకత్వం, ప్రతిదానికీ హైకామండ్ ముందు మోకరిల్లాల్సి రావడం వంటి కారణాల వల్ల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో పలచనవుతోంది. మంత్రులతంతా ఎవరికివారు యమునా తీరే అన్నట్లుగా ఉంటున్నారు. తమ శాఖల పరిధిలోని కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయలేక పోతున్నారు. దేవాయదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖకు ఈ రెండు శాఖల్లో ఏం జరుగుతుందో తెలియడం లేదు. అడవుల పెంపకం లేదు. కోతులు గ్రామాలను పట్టిపీడిస్తున్నా పట్టించుకోవడం లేదు. దేవాలయ భూముల చెరను విడిపించలేకపోతున్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాటలకే పరిమితం అయ్యారు. ఎక్కడా రోడ్ల అభివృద్ధి జరగడం లేదు. రాజధాని హైదరాబాద్ అంతర్గత రోడ్లు ఏడాది దాటినా అభివృద్ధిక నోచలేదు. గ్రామాల్లో నిధులు విడుదల కాకపోవడంతో పనులు పడకేశాయి. ఇలా ఒక్కోమంత్రి తీరు ఒక్కోలా ఉంది. శాఖల్లో పనులు సక్రమంగా సాగడం లేదు. కాంగ్రెస్ అధికారంలో ఉంటే ప్రజలను పట్టించుకోదు.. ప్రతిపక్షంలో ఉంటే విపక్షంగా గట్టి పాత్ర నిర్వహించదు. అధికారం కోసం వెంపర్లాడడం తప్ప అణగిమణిగి ఉండాలన్న ఆకాంక్ష కానరాదు. పార్టీని బలోపేతం చేయడం కోసం ఎవరూ పాటుపడరు. పాటుపడేందుకు ఎవరైనా ముందుకు వస్తే కాళ్లు లాగేస్తుంటారు. అధికారం వస్తే పదవుల కోసం పాకులాడుతారు. అధికారం లేకుంటే కీచులాటతో పార్టీని భ్రష్టు పట్టిస్తుంటారు. మొత్తంగా కాంగ్రెస్‌లో ఒకరిపై ఒకరికి విశ్వాసం ఉండదు. నాయకత్వాన్ని సహించే లక్షణం లేదు. నాయకుడు ఎవరైనా కాళ్ళల్లో కట్టెలు పెట్టడం అలవాటు. అలా పార్టీకిచేటు జరుగుతున్నా పట్టించుకోరు. తాజాగా తెలంగాణ కాంగ్రెస్‌లో ఇదే ధోరణి కనిపిస్తోంది. బిఆర్ఎస్, బిజెపిలు చేస్తున్న విమర్శలను సమర్థంగా తిప్పికొట్టలేక పోతున్నారు. హైదరాబాద్ భూముల విషయంలో వీరి వాదన పేలవంగా ఉంది. నిజానికి భూమిని కోర్టులో పోరాడి దక్కించుకుంటే దానిని రక్షించాలి తప్ప అమ్మరాదు. సన్నబియ్య, పెన్షన్ల పేరుతో దుబారా చేసే బదులు దుబారాకు కళ్లెం వేయాలి.ప్రస్తుత కాంగ్రెస్ నేతలు ఎవరికి వారే అధికార కూటమిని ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇది నిజంగా ఆత్మహత్య సదృశ్యమే. ఇలా జాతీయ స్థాయిలోనూ కనిపిస్తాయి. అధికారంలో ఉంటే కళ్లు నెత్తికెక్కుతాయి. పార్టీలో ఎవరైనా పెత్తనం చెలాయిస్తారని భావిస్తే అలాంటి వారిని అసలు చేరకుండా అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తుంటారు. పార్టీపరంగా రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉంటారే తప్ప పరిష్కారనికి ముందుకు రారు. జాతీయస్థాయిలో అయినా.. రాష్ట్రస్థాయిలో అయినా ఇదే పరిస్థితి ఉంటుంది. తాజాగా తెలంగాణలో జరుగుతున్న పరిస్థితులు కూడా ఇందుకు భిన్నం కాదు. రేవంత సిఎంగా ముందుకు నడుస్తున్న వేళ..పటిష్ట నిర్ణయాలపై చర్చించడం లేదు. సమస్యలను చర్చించి పరిష్కరించే చర్యలు కానరావడం లేదు. ఉమ్మడిగా పినచేయడం లేదు. కేవలం రేవంత్ మాత్రమే అందరినీ కలుపుకుని పోయేలా
ఉంటున్నారు. పిసిసి
చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కూడా పెద్దగా పార్టీని గాడిలో పెట్టే ప్రయత్నాలు చేయడం లేదు. పార్టీ పరువు పోయినా, ఉన్న వారు బయటకు పోతున్నా.. ఉన్నవారు మాత్రం బింకాన్ని వదలకుండా తమకోసం పోరాడుతారు. తెలంగాణలోని పలువురు కాంగ్రెస్ నేతలకు కూడా ఈ జాడ్యం పట్టుకుంది. పార్టీలో వ్యతిరేకంగా పనిచేయడం పట్ల కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌గా పరిగణించి..రేవంత్ రెడ్డికి పూర్తి అధికారం ఇచ్చి నడిపించడం లేదు. ఎందుకంటే రాజకీయాలు చేయడం అక్కడే మొదలవుతోంది. అధిష్టానం కర్నాటక, తెలంగాణలను పిండేస్తోందని ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్ భూముల అమ్మకం వెనకా ఒత్తిళ్లు ఉన్నాయని అంటున్నారు. కేంద్రంలో బీజేపీ బలహీన పడితే, ఆ పరిస్థితి ఒక్క కాంగ్రెస్ పార్టీకి మాత్రమే లాభిస్తుంది. కొన్ని రాష్ట్రాలలో మాత్రమే బీజేపీ, కాంగ్రెస్ ఎదురెదురు నిలిచి ఉన్నాయి. ఈ రాష్ట్రాలలో బీజేపీ బలహీన పడితే కాంగ్రెస్ కొంత లబ్ధి పొందవచ్చు. బీజేపీ ఎంత బలహీనపడినా, కాంగ్రెస్ పూర్వ వైభవాన్ని సంతరించుకోవడం అనుమానమే.

# విద్యా వ్యాపారానికి వ్యతిరేకంగా పోరాడాలి.



పిడిఎస్ యూ పూర్వ నాయకులు పరుచూరి శ్రీధర్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 13:**

విద్యా వ్యాపారానికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని పూర్వ పిడిఎస్ యూ నాయకులు సీనియర్ న్యాయవాది పరుచూరి శ్రీధర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. నగరంలో ఆదివారం పిడిఎస్ యూ ముఖ్య కార్యకర్తల సమావేశం నీలం రామచంద్రయ్య భవన్లో నిర్వహించారు.ఈ సందర్భంగా పరుచూరి శ్రీధర్ మాట్లాడుతూ, విదేశాలలో విద్యను ప్రభుత్వాలు ఉచితంగా అందిస్తుంటే మనదేశంలో మాత్రం విద్య వ్యాపారమైందని అన్నారు,
విద్యాభివృద్ధికి కొఠారి కమిషన్ కేంద్ర బడ్జెట్లో 10% శాతం నిధులు, రాష్ట్ర బడ్జెట్లో 30% నిధులు కేటాయించాలని సూచిస్తే, కేంద్రంలో 2 శాతం, రాష్ట్రంలో 7 శాతానికి మించి కేటాయించటం లేదని,
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా కార్పోరేటీకరణ, ప్రైవేటీకరణ, కాషాయీకరణను ప్రోత్సహించడం దుర్మార్గం అని అన్నారు. ఉన్నత వర్గాలు అధిక డబ్బులిచ్చి ఉన్నత విద్య ను కొనుక్కుంటున్నారని, పేద విద్యార్థులు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారిందని అన్నారు. విద్యార్థులు మొబైల్, అశ్లీలత,మత్తు మారకద్రవ్యాలతో బానిసలు కాకుండా సమాజాన్ని అర్థం చేసుకొని పాలకుల అనుసరిస్తున్న విధానాలను ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.
రాజకీయాలకు మన జీవితాలు ముడిపడి ఉన్నాయని, ప్రతి సమస్యను నిర్దిష్టంగా పరిశీలన చేయడం నేర్చుకోవాలని అన్నారు.

**పిడిఎస్ యూ మాజీ నాయకులు జి.రమేష్ మాట్లాడుతూ..**

జిల్లాలో పిడిఎస్ యూ అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించిందని, అందులో ముఖ్యంగా జిల్లాలో సంక్షేమ హాస్టల్స్ ఏర్పాటు ,ఖలీల్వాడి స్కూల్ గ్రౌండ్ రక్షణ కోసం, మెడికల్ కళాశాల ఏర్పాటు, తెలంగాణ యూనివర్సిటీ, గిరిరాజ్ కాలేజ్ లో పీజీ సెంటర్ఏర్పాటు కోసం ఉద్యమం చేసి విజయం సాధించిందని అన్నారు.జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, ఇండోర్ స్టేడియం కోసం పి డి ఎస్ యూ విద్యార్థి సంఘం పోరాడాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్ గౌతం కుమార్, జన్నారపు రాజేశ్వర్, జిల్లా సహాయ కార్యదర్శులు ప్రిన్స్,దేవిక జిల్లా నాయకులు మనోజ్, నిఖిల్, ఆకాష్, ముఖ్య కార్యకర్తలు రాహుల్, సాయి కిరణ్, నాందేవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ ఉపాధ్యాయ నేత అస్తమయం.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 13:**

**క్యాన్సర్ పోరాడుతూ కె. రమణ సార్ మరణం.**
**టిపిటిఎఫ్ కార్యకర్త నుండి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎదిగిన సార్.**
**పదవి విరమణ అనంతరం కూడా**
**ప్రజా ఉద్యమాల వెంట పయనం.**

ఉద్యమ ఉపాధ్యాయ నేత, టిపిటిఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కందుకూరి రమణ సార్ ఆదివారం మధ్యానం తుది శ్వాస విడిచారు. గత కొన్ని ఏళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నా, తుది శ్వాస వరకు ప్రజా ఉదమాల్లో భాగస్వామ్యం అయ్యాడు. పదవి విరమణ అనంతరం కూడా ఉపాధ్యాయ, ప్రజా ఉద్యమాలలోనూ భాగస్వామ్యం అయి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. ప్రేమ, ఆప్యాయత తో అందరితో కలుపుగోలుగా ఉండేవారు రమణ సార్. 90వ దశకంలో రెండు విప్లవ గ్రూపుల మధ్యన జరిగిన సంఘర్షణలో వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడానికి పౌర హక్కుల నాయకుడిగా ప్రొఫెసర్ కోదండరాం ఎల్లారెడ్డి పేట, దూమాల పరిసర ప్రాంతాలలోని పరిస్థితులను తెలుసుకోవడానికి రమణ సార్ సహకారంతో ఆ ప్రాంతాల ఉద్యమ నాయకులను కలిసి మాట్లాడడం మర్చిపోలేని జ్ఞాపకం. ఆర్మూర్ ప్రాంతంలో ఎర్రజొన్న రైతుల సమస్యలపై జరిగిన ఆందోళనలో కాల్పులు జరగడం. ఈ అంశంపై విచారణకు అమరజీవి డాక్టర్ బాలగోపాల్ తో సహా రమణ ఫాక్ట్ ఫైండింగ్ లో పాల్గొన్నారు. మొదట ఉద్యోగిగా సిరిసిల్ల ప్రాంతంలో పనిచేస్తూ ఎపిటిఎఫ్ జిల్లా నాయకుని గా ఎదిగి, తన జీవిత సహచరి నాగశ్రీ నిజామాబాదులో ఎయిడెడ్ స్కూల్లో పని చేయడం వలన, రమణ సార్ నిజామాబాద్ జిల్లాకు మారి జిల్లాకు నాయకత్వం వహించాడు. మూడు సంఘాల కలయిక సందర్భంలో రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేశారు.రాజన్న సిరిసిల్ల జిల్లా, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన కందుకూరి రమణ సర్ కామారెడ్డిలో స్థిర నివాసం అయ్యారు.

రమణ సార్ మృతి పట్ల టిపిటిఎఫ్, డిటిఎఫ్, యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులతో పాటు మాజీ నేతలు, రమణ సార్ సహచరులు, పీడీఎస్ యు నాయకులు, పౌరహక్కుల సంఘం నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

# సంక్షేమం పేరుతో..దివాళా తీయిస్తే ఎలా !

సంక్షేమం పేరుతో ఉచిత పథకాలు అమలు చేయమని చెప్పిందెవరు..ఉచిత బియ్యాలు, ఉచిత పందేరాలు... 58 ఏళ్లకే పెన్షన్లు.. .రాజకీయ నాయకులకు జీతభత్యాలు..ఇవన్నీ ఎవరి కోసం..ప్రజలు కట్టిన పన్నులతో పాటన చేయాల్సిన నేతలు రాష్ట్రాలను దివాళా తీయించేస్తున్నారు. అభివృద్ధి అంటే పెన్షన్లు పంచడం, సన్నబియ్యం పంచడం ఇదేనా..ఇవన్నీ నిలదీయడానికి ప్రజలంతా సిద్ధం కావాలి. ఎపి కావచ్చు.. తెలంగాణ కావచ్చు....ధరల గురించి మాట్లాడరు. అభివృద్ధి గురించి మాట్లాడరు. వారి సెక్యూరిటీ, ఆకాశ హర్మ్యాలను నిర్మించుకోవడం...ప్రజల డబ్బుతో సోకులు చేసుకోవడం ఇదా పాలన అంటే..అన్నది ప్రజలంతా ఆలోచించాలి. జగన్ తన హయాంలో రాజధాని, పోలవరం నిర్మాణాలను పక్కన పెట్టారు. విశాఖ భీమిలి దగ్గర మాత్రం అద్భుత సౌధాలను నిర్మించుకున్నారు. దీనికి నాటి పాలకులు నేటికీ సమర్థించు కుంటున్నారు. ఇంతకన్నా దౌర్భాగ్యం ఉండదు. ఇలాంటి పాలకులు అవసరమా అని ఆలోచన చేయాలి. రాష్ట్రాలను అప్పుల్లో కూరుకు పోయేలా చేసి...దివాళా తీయించిన నేతలు నీతి వాక్యాలు పలుకుతున్నారు. అభివృద్ధి చేశామని గొప్పులు చెప్పుకుంటున్నారు. సకాలంలో ధాన్యం కొనుగోళ్లు చేయరు. మిర్చి పండితే కొనుగోలు చేయలేరు. విద్యుత్, వైద్యం, విద్యారంగాలను పటిష్ఠంట చేయరు. ఇవన్నీ మరచి పందేరాలు చేస్తున్న ...వీరా మన పాలకులు ..అయినందుకు సిగ్గు పడాలి. ఇక తాజాగా హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని నిస్సిగ్గుగా అమ్మాలనుకోవడం రేవంత్ ప్రభుత్వ దివాళాకోరు విధానం కాక మరోటి కాదు. పెన్షన్లు, ఉచిత బస్సు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు ఎవరు అడిగారు. ఇవ్వడానికి డబ్బులు ఉన్నాయో లేదో ఆలోచించకుండా ఇష్టారీతిన హామీలు ఇచ్చి ఇప్పుడు భూములు, ఆస్తులు తెగనమ్మితే ఎలా. నీతులు పలుకుతున్న గత బిఆర్ఎస్ పాలకులు కూడా ఇంతకన్నా భిన్నంగా చేయలేదు. వారి హయాంలోనూ భూములు అమ్ముకున్నారు. పేదలు ఇళ్లు కొనగలిగేలా పరిస్థితులు ఉంటే మూసీ మురికిలో ఎందుకు నివసిస్తారు. మూసీ సుందరీకరణ పేరుతో వారిని నిర్వాసితులను చేయడం ఎంతవరకు సమంజసం. మూసీ సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ పేరిట పేదల ఇళ్లు కూల్చడం ఎంతవరకు సబబు. లగచర్లలో ఫార్మా పేరుతో దాడులు జరిగాయి.

వేగుచుక్క

# గేరు మార్చిన ఐశ్వర్య రాజేష్..



ఐశ్వర్య రాజేష్ కీలకపాత్రలో నటించిన వెబ్ సిరీస్ సుడల్ 2 నేటి నుంచి స్ట్రీమింగ్ అవుతుంది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో వస్తున్న ఈ సిరీస్‌పై మంచి అంచనాలు ఉన్నాయి. ఎందుకంటే ఈ సిరీస్ ఫస్ట్ పార్ట్ సూపర్ హిట్ అయింది. ఇక ప్రస్తుతం ఈ సిరీస్ ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది ఐశ్వర్య. అయితే తాజాగా ఐశ్వర్య రాజేష్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఈ ఏడాది సంక్రాంతికి రిలీజైన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో బ్లాక్ బస్టర్ తన ఖాతాలో వేసుకుంది ఐశ్వర్య రాజేష్. ఇందులో వెంకటేష్ భార్య భాగ్యం పాత్రలో ఐశ్వర్య యాక్టింగ్ ఇరగదీసింది. ముఖ్యంగా భర్త ఎక్కడ తన ఎక్స్ గర్ల్‌ఫ్రెండ్‌కి మళ్లీ దగ్గరైపోతాడోనని ఐశ్వర్య చూపించే కంగారు, భయం, టెన్షన్ అన్నీ స్క్రీన్ మీద నవ్వులు పూయించాయి. ఇక తన సహజ నటన, యాసతో కూడా ఐశ్వర్య ఫిదా చేసింది.

అయితే భాగ్యం పాత్రలో చాలా పద్ధతిగా చీరలో కనిపించింది ఐశ్వర్య. కానీ తాజాగా షేర్ చేసిన ఫొటోల్లో ఐశ్వర్య గ్లామర్ ట్రీట్ మామూలుగా లేదు. సడెన్‌గా ఐశ్వర్య ఫొటో చూసి చాలా మంది అవాక్కవుతున్నారు. ఏంటి ఇది ఐశ్వర్యేనా అంటూ కామెంట్లు పెడుతున్నారు. నిజానికి తన కెరీర్‌లో చాలా వరకూ ట్రెడిషనల్ లుక్ ఉన్న పాత్రల్లోనే ఐశ్వర్య నటించింది. కానీ మోడ్రన్ లుక్‌లో గ్లామర్ ట్రీట్ ఇవ్వడానికి కూడా ఐశ్వర్య తగ్గేదేలే అని ఈ ఫొటోలు చెబుతున్నాయి.

కెరీర్ విషయానికొస్తే సంక్రాంతికి వస్తున్నాం హిట్‌తో తెలుగులో ఐశ్వర్యకి క్రేజీ ఆఫర్లు వస్తున్నాయి. మరోవైపు తమిళంలో మూడు, కన్నడలో ఓ ప్రాజెక్ట్ కూడా ఐశ్వర్య చేతిలో ఉంది. వీటితో పాటు కొన్ని వెబ్ సిరీస్ కూడా చేస్తుంది. ఐశ్వర్య రాజేష్ చెన్నైలో సెటిల్ అయిన తెలుగు కుటుంబంలో పుట్టింది. ఐశ్వర్య తండ్రి రాజేష్ తెలుగులో ఎన్నో చిత్రాల్లో నటించారు. ఇక ఒకప్పటి కమెడియన్ శ్రీలక్ష్మి.. ఐశ్వర్యకి మేనత్త అవుతారు. ఈ విషయం చాలా మందికి తెలీదు. అలానే తెలుగులో సంక్రాంతికి వస్తున్నాం చిత్రం కంటే ముందు మిస్ మ్యాచ్, వరల్డ్ ఫేమస్ లవర్, టక్ జగదీష్ లాంటి పలు సినిమాల్లో యాక్ట్ చేసింది. 'కౌసల్య కృష్ణమూర్తి' చిత్రంతో ఐశ్వర్య టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. కానీ తెలుగులో కంటే తమిళంలోనే ఐశ్వర్యకి సక్సెస్ దక్కింది. దీంతో అక్కడే ఎక్కువ చిత్రాలు చేసింది. కానీ ఇప్పుడు 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో టాలీవుడ్‌లో కూడా ఐశ్వర్య కెరీర్ ఊపందుకునే ఛాన్స్ ఉంది.

# సారీ చెప్పిన రష్మిక



ఇండియన్ సినిమాలో గత కొన్నాళ్లుగా రష్మిక డామినేషన్ కొనసాగుతోంది. ఆమె నటించే సినిమాలన్నీ బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ హిట్స్ సాధిస్తున్నాయి. ఇప్పటికే 'యానిమల్' 'పుష్ప 2: ది రూల్' 'ఛావా' వంటి హ్యాట్రిక్ విజయాలు అందుకుంది. ఇటీవల కాలంలో వరుసగా మూడు భారీ బ్లాక్ బస్టర్స్ అందుకున్న హీరోయిన్ గా రష్మిక నిలిచింది. 'సికిందర్' 'కుబేర' సినిమాల షూటింగ్స్ కంప్లీట్ చేసిన నేషనల్ క్రష్.. తాజాగా ఇన్స్టాగ్రామ్ పెట్టిన ఓ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది.

నేషనల్ క్రష్ రష్మిక మందన్న బ్యాక్ టూ బ్యాక్ హిట్స్ తో దూసుకుపోతోంది. సినిమా సినిమాకీ తన క్రేజ్ తో పాటుగా, బ్రాండ్ వేల్యూని కూడా పెంచుకుంటూ వెళ్తోంది. ఓవైపు సినిమాల్లో మంచి రెమ్యునరేషన్ తీసుకుంటూనే, మరోవైపు బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ తో రెండు చేతులా సంపాదిస్తోంది. ప్రస్తుతం ఆమె చేతిలో పలు క్రేజీ ప్రాజెక్ట్స్ ఉన్నాయి. అయితే కాలి గాయం కారణంగా కొన్ని రోజులు రెస్ట్ మోడ్ లో ఉన్న ఈ బ్యూటీ.. సోషల్ మీడియా ద్వారా అభిమానులకు టచ్ లో ఉంటోంది. తాజాగా ఇన్స్టాగ్రామ్ లో ఓ ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టింది.

రష్మిక మందన్న బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న పాపులర్ కంపెనీలలో ఒనిట్సుకా టైగర్ ఒకటి. ఇండియాలో ఆ బ్రాండ్ ప్రోడక్ట్స్ ని ప్రమోట్ చేస్తూ ప్రతీ ఏడాది ఫోటో షూట్స్ చేస్తుంది. మిలాన్ లో జరిగే ఫ్యాషన్ షోలో ర్యాంప్ వాక్ చేస్తూ ఫోజులిస్తుంది. కానీ ఈసారి ఒనిట్సుకా టైగర్ ను బాలీవుడ్ బ్యూటీ వామికా గబ్బీ ప్రమోట్ చేస్తోంది. ఈ మేరకు రెండు రోజుల క్రితం ఇన్స్టాగ్రామ్ లో కొన్ని ఫోటోలను షేర్ చేసింది. మిలాన్ ఫ్యాషన్ వీక్ కోసం అంతా సిద్ధమైందని పోస్ట్ పెట్టింది. రష్మిక ఈ ఫోటోని తన ఇన్‌స్టా స్టోరీలో పోస్ట్ చేస్తూ.. ఒనిట్సుకా టైగర్ టీంకి క్షమాపణలు చెప్పింది.

"సారీ ఒనిట్సుకా.. ఈ సంవత్సరం చేయలేకపోయాను. అయితే ఈసారి తోటి ఛీర్ లీడర్, బ్యూటిఫుల్ వామికా గబ్బీ మీతో ఉంది. వామికా.. నువ్వు చాలా అందంగా ఉన్నావు. మీరు అద్భుతమైన ప్రదర్శన చేస్తారని ఆశిస్తున్నాను" అని రష్మిక తన స్టోరీలో రాసుకొచ్చింది. నిజానికి కాలి గాయం కారణంగా ఆమె కొన్ని రోజులుగా తీవ్రంగా ఇబ్బంది పడుతోంది. కుంటు కుంటూనే 'ఛావా' మూవీ ప్రమోషన్స్ కు హాజరైంది. ఇంకొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు తెలుస్తోంది. అందుకే ఒనిట్సుకా తరపున మిలాన్ ఫ్యాషన్ వీక్ లో పాల్గొనలేకపోయిందని ఫ్యాన్స్ అభిప్రాయ పడుతున్నారు.

సినిమాల విషయానికొస్తే.. 'యానిమల్' 'పుష్ప 2: ది రూల్' బ్లాక్ బస్టర్స్ తో ఫుల్ జోష్ లో ఉన్న రష్మిక మందన్నకు 'ఛావా' రూపంలో మరో సక్సెస్ వచ్చింది. ఛత్రపతి శంభాజీ జీవితం ఆధారంగా రూపొందిన ఈ హిస్టారికల్ యాక్షన్ డ్రామాలో విక్కీ కౌశల్ కు జోడీగా, యేసుబాయి పాత్రలో ఆమె నటించింది. ఇది బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లను రాబడుతోంది. వచ్చే వారం తెలుగులోనూ రిలీజ్ కానుంది. ఏఆర్ మురగదాస్ దర్శకత్వంలో సల్మాన్ ఖాన్ తో కలిసి నటించిన 'సికందర్' సినిమా ఈద్ స్పెషల్ గా రానుంది. ఇదే క్రమంలో శేఖర్ కమ్ములతో చేసిన 'కుబేర'.. ఆయుష్మాన్ ఖురానాతో నటించే 'థమా' చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.

# హెవీ వర్కౌట్లతో బిజీగా సమంత



సమంత ప్రస్తుతం హెవీ వర్కౌట్లతో బిజీగా ఉంటోంది. మయోసైటిస్ నుంచి సమంత పూర్తిగా కోలుకున్నట్టుగా కనిపిస్తోంది. మయోసైటిస్ కారణంగా అసలు బెడ్డు మీద నుంచి కూడా లేవలేని స్థితిలోకి సమంత వెళ్లింది. ఇక ఇప్పుడు సమంత హెవీ వర్కౌట్లతో అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. చూస్తుంటే ఫిజికల్‌గా, మెంటల్‌గా సమంత చాలా స్ట్రాంగ్ అయినట్టుగా తెలుస్తోంది.

సమంత ప్రస్తుతం సినిమాలతో బిజీగా ఏమీ ఉండటం లేదు. ఒకప్పటిలా ప్రాజెక్టుల్ని అంగీకరించడం లేదు. వరుసగా చిత్రాలను కూడా చేయడం లేదు. ప్రస్తుతం తన కోసమే తన టైం అంతా కేటాయించుకుంటోంది. తన హెల్త్ పట్ల మరింత కేరింగ్‌గా సమంత ఉంటోంది. మయోసైటిస్ నుంచి ఇప్పుడు సమంత పూర్తిగా కోలుకున్నట్టు కనిపిస్తోంది. అయితే సమంత ఇప్పుడు జిమ్‌లో చేస్తున్న వర్కౌట్లు చూసి అంతా నోరెళ్లబెట్టేస్తున్నారు. 110 కేజీల బరువుని ఎత్తేస్తూ అందరినీ మోటివేట్ చేస్తోంది.

సమంత కరోనా టైంలో ఎంత కష్టపడిందో అందరికీ తెలిసిందే. కరోనా వల్ల సినిమాలు లేక, ఇండస్ట్రీలో పని దొరక్క చాలా మంది అవస్థలు పడ్డారు. అలాంటి టైంలోనే సమంత మరింతగా కుంగిపోయింది. మయోసైటిస్ వల్ల అసలు సమంత బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. చాల రోజులు సోషల్ మీడియాకు సమంత దూరమైంది. ట్రీట్మెంట్ కోసం సమంత రకరకాల పద్ధతుల్ని పాటించింది.

రకరకాల ప్రదేశాలకు వెళ్లి, నాటు వైద్యం, ప్రకృతి వైద్యం, ఆయుర్వేదం ఇలా అన్ని రకాలుగా ట్రై చేసింది. ప్రస్తుతానికి సమంత పూర్తి ఆరోగ్యంగానే ఉందని తెలుస్తోంది. ఒకప్పుడు సమంత జిమ్‌లో వంద కేజీల బరువు ఎత్తి ఛాలెంజ్‌లు విసిరేది. నాగ చైతన్య, అమల, నాగార్జున, సమంత ఇలా అందరూ కలిసి జిమ్‌లోనే సందడి చేసిన క్షణాల గురించి తెలిసిందే. ఒకప్పుడు ఫిట్ నెస్ ఛాలెంజ్‌లో సమంత అంతలా కనిపించేది. మయోసైటిస్ తరువాత సమంత మళ్లీ మొదటి నుంచి ప్రారంభించింది. చిన్న చిన్నగా బరువులు ఎత్తుతూ సమంత మళ్లీ మునుపటిలా బీస్ట్ మోడ్‌లోకి మారే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో సమంత ఇప్పుడు 110 కేజీల బరువు ఎత్తేసింది. చేస్తే ఇలా గట్టిగా కష్టపడాలి.. శ్రమించాలి.. లేదంటే ఇంట్లోనే పడుకోవాలి అంటూ సమంత మోటివేట్ చేసింది. ప్రస్తుతం సమంత తన ఇన్ స్టా స్టోరీలో పెట్టిన వర్కౌట్ వీడియో అందరినీ ఆకట్టుకుంటోంది. ఇక సమంత సినిమా అప్డేట్లు ఎప్పుడు వస్తాయో చూడాలి.

# తల్లి కాబోతోన్న కియారా ..



కియారా తాజాగా ఓ గుడ్ న్యూస్‌ను అభిమానులతో పంచుకుంది. తాము పండంటి బిడ్డకు జన్మను ఇవ్వబోతోన్నామని కియారా అద్వాణి, సిద్దార్థ్ మల్హోత్రాలు ప్రకటించారు. ఈ మేరకు కియారా, సిద్దార్థ్ మల్హోత్రాలు సోషల్ మీడియాలో వేసిన పోస్ట్ వైరల్ అవుతోంది. ఎంత క్యూట్‌గా ప్రకటించారో.. ఆ చిట్టి సాక్సులు ఎంత క్యూట్‌గా ఉన్నాయో అని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఇక సమంత, రకుల్ వంటి సెలెబ్రిటీలు సైతం కియారా పోస్ట్ మీద స్పందిస్తున్నారు.

కియారా తాను తల్లిని కాబోతోన్నాను అని చెప్పకనే చెప్పింది. సిద్దార్థ్ మల్హోత్ర, కియారా అద్వానీలు తమకు పండంటి బిడ్డ పుట్టబోతోన్నారని చిట్టి సాక్సులను షేర్ చేశారు. ఇక ఇలా గుడ్ న్యూస్ చెప్పారో లేదో.. నెటిజన్లు, సెలెబ్రిటీలు వీరికి కంగ్రాట్స్ చెబుతున్నారు. సమంత, రకుల్, రియా కపూర్, ఇషాన్ కట్టార్, హ్యూమా ఖురేషి వంటి వారు కియారా, సిద్దార్థ్ పోస్టుల మీద స్పందిస్తున్నారు.

కియారా గేమ్ ఛేంజర్ ప్రమోషన్స్‌లో కూడా ఎక్కువగా పాల్గొనలేదు. కారణం ఇదే అయి ఉంటుందని ఇప్పుడు జనాలు అనుకుంటున్నారు. కియారా అద్వానీ గర్భం దాల్చడంతోనే ఎక్కువగా బయటకు రాలేకపోయిందని, అందుకే గేమ్ ఛేంజర్ ప్రమోషన్స్ కోసం హైదరాబాద్‌కు రాలేదన్నట్టుగా కనిపిస్తోంది. కియారా, సిద్దార్థ్‌లకు రెండేళ్ల క్రితం పెళ్లి అయిన సంగతి తెలిసిందే. 2023 ఫిబ్రవరి 7న వీరికి రాజస్థాన్‌లోని కోట ఘనంగా వివాహం జరిగింది. పెళ్లైన రెండేళ్లకు ఇలా గుడ్ న్యూస్ ప్రకటించడంతో వారి అభిమానులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. కియారా, సిద్దార్థ్ వేసిన పోస్ట్ అందరినీ ఆకట్టుకుంటోంది. గర్భం దాల్చినట్టుగా నేరుగా చెప్పకుండా.. ఓ బిడ్డ రాబోతోందంటూ చిట్టి సాక్సుల్ని షేర్ చేశారు. త్వరలోనే రాబోతోన్నారు అంటూ ప్రకటించడంతో కియారా, సిద్దార్థ్‌లకు అంతా కంగ్రాట్స్ చెబుతున్నారు.

కియారా అద్వానీ తెలుగులో స్టార్ హీరోల సరసన నటించిన సంగతి తెలిసిందే. మహేష్ బాబుతో భరత్ అనే నేను, రామ్ చరణ్‌తో వినయ విధేయ రామ అంటూ సందడి చేసింది. ఆ తరువాత మళ్లీ బాలీవుడ్ మీదే ఎక్కువగా ఫోకస్ పెట్టింది. ఇక అక్కడ లస్ట్ స్టోరీస్ అంటూ కియారాకు మంచి క్రేజ్ వచ్చింది. రీసెంట్‌గా రామ్ చరణ్ శంకర్ కాంబోలో వచ్చిన గేమ్ ఛేంజర్ మూవీలో కియారా సందడి చేసింది. కానీ మళ్లీ రామ్ చరణ్ కియారా కాంబోకి ఫ్లాప్ పడినట్టు అయింది. వీరిద్దరి ఫెయిల్యూర్ కాంబో అనే ముద్ర పడిందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.



ప్రగ్యా జైస్వాల్, బెల్లంకొండ శ్రీనివాస్ కలిసి జయ జానకి నాయక చిత్రంలో నటించారు. కానీ అందులో రకుల్ ప్రీత్ మెయిన్ హీరోయిన్. ప్రగ్యా జైస్వాల్ అలా మధ్యలో మెరిసి వెళ్లిపోతుంది. ఇక మళ్లీ ఇప్పుడు టైసన్ నాయుడు అంటూ ఈ ఇద్దరూ ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. తాజాగా సెట్స్‌లో ప్రగ్యా జైస్వాల్ హీరో లంచ్ బాక్స్ మొత్తం ఖాళీ చేసినట్టుగా కనిపిస్తోంది. బెల్లంకొండ శ్రీను తెచ్చుకున్న బాక్సుని ప్రగ్యా లాగేసుకున్నట్టుగా కనిపిస్తోంది. హీరో హీరోయిన్లు సెట్స్ మీద ఎంత సరదాగా ఉంటారో అందరికీ తెలిసిందే. ఇక ప్రభాస్ అయితే తన టీం మొత్తానికి ఫుడ్‌ను తెప్పిస్తుంటాడు. అందరితో కలిసి భోజనాలు చేస్తుంటాడు. రోజూ విందు భోజనాల్లానే ప్రభాస్ సెట్స్ మీద అన్నీ ఐటంలను తెప్పిస్తుంటాడు. ఇక తాజాగా బెల్లంకొండ శ్రీనివాస్ తెచ్చుకున్న లంచ్ బాక్స్‌ని ప్రగ్యా జైస్వాల్ ఖతం చేసినట్టుగా ఉంది. ఈ మేరకు తాజాగా ప్రగ్యా జైస్వాల్ ఇన్ స్టా స్టోరీలో ఓ పోస్ట్ పెట్టింది.ప్రస్తుతం బెల్లంకొండ శ్రీను, ప్రగ్యా జైస్వాల్ కలిసి టైసన్ నాయుడు అనే చిత్రంలో నటిస్తున్నారు. ఛత్రపతి హిందీ రీమేక్ తరువాత బెల్లంకొండ శ్రీను చాలా నెమ్మదిగా సినిమాలు చేస్తూ వస్తున్నాడు. తన వద్దకు వచ్చిన అన్ని

# మొత్తం ఖాళీ చేసిందట..

స్క్రిప్ట్‌లను కాకుండా తనకు నచ్చిన కథల్ని మాత్రమే ఎంచుకుంటూ ఉన్నట్టుగా కనిపిస్తోంది. టైగర్ నాగేశ్వరరావు స్క్రిప్ట్‌ని కూడా బెల్లంకొండ బాబు ఇలానే ఎంచుకున్నాడు. కానీ చివరకు ఆ ప్రాజెక్ట్‌ని రవితేజ చేశాడు. ఇక ఇప్పుడు బెల్లంకొండ శ్రీనివాస్ వరుస ప్రాజెక్టులతో ఆడియెన్స్ ముందుకు వచ్చేందుకు రెడీ అవుతున్నాడు. భైరవం అంటూ త్వరలోనే ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నాడు. ఇక టైసన్ నాయుడు సెట్స్ మీద ఉందన్న సంగతి తెలిసిందే. ఈ సెట్‌లోనే ప్రగ్యా జైస్వాల్, బెల్లంకొండ శ్రీను అల్లరి చేస్తున్నారు. ఇక బెల్లంకొండ హీరో తెచ్చుకున్న లంచ్ బాక్సుని ప్రగ్యా జైస్వాల్ ఖాళీ చేసినట్టుగా ఉంది. బెల్లంకొండ శ్రీను తెచ్చుకున్న ఆఫ్ఘన్ చికెన్, క్యారెట్ రోటీని ప్రగ్యా తినేసిందట. యమ్మీగా ఉందని చెప్పింది. ఫుడ్‌ను షేర్ చేసినందుకు చాలా థాంక్స్.. మొత్తం బాక్సుని ఖాళీ చేశా అని ప్రగ్యా చెప్పుకొచ్చింది. ప్రగ్యా ప్రస్తుతం బాలయ్య సినిమాలతో వరుసగా హిట్లు కొడుతోంది. అఖండ, డాకు మహారాజ్ అంటూ ప్రగ్యాకు మంచి హిట్లు పడ్డాయి. ఇక ఇప్పుడు అఖండ 2లోనూ ప్రగ్యా కనిపించేలా ఉంది. ఇక బాలయ్య సినిమా అంటే ప్రగ్యా జైస్వాల్ తప్పనిసరి అన్నట్టుగా మారిపోయింది.